సాక్షి నిజామాబాద్

ఆదివారం । 28 । జనవరి । 2024



రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

రిపబ్లిక్ డే వేడుకల్లో గవర్నర్ ప్రసంగంలో రుణమాఫీ అంశాన్ని ప్రస్తావించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

- 8లో ▸



బీసీలకు మంత్రి పదవులు..

రాష్ట్ర మంత్రి వర్గంలో ఎనిమిది మంది బీసీలకు చోటు కల్పించాలని బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

30.3 /17.6

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



సుభాష్‌నగర్: బాలికలు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'బేటీ బచావో – బేటీ పడావో' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభను చాటుతున్నారన్నారు. గతంతో పోలిస్తే పరిస్థితిలో చాలావరకు మార్పు వచ్చిందని, చదువుతో పాటు క్రమశిక్షణలోనూ బాలికలదే పైచేయిగా నిలుస్తోందన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో విద్యార్థి దశ కీలకమని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని సూచించారు. బాలికలపై తల్లిదండ్రులు వివక్ష చూపకుండా ఉన్నత విద్యాభ్యాసం దిశగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థినులకు సైకిళ్లతోపాటు వివిధ పోటీల్లో గెలుపొందిన వారి కి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ జయరాం, డీడబ్ల్యూవో రసూల్‌బీ, డీఈవో దుర్గాప్రసాద్, జిల్లా కార్మి క శాఖ అధికారి యోహాన్, మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు భవ్యశ్రీ ఎంపిక



జక్రాన్‌పల్లి : మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన ఆకుల భవ్యశ్రీ అండర్–19 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు సర్పంచ్ చేతన విజయ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు కర్ణాటకలో జరిగే పోటీల్లో భవ్యశ్రీ పాల్గొంటారని చెప్పారు. భవ్యశ్రీని సర్పంచ్, ఉపసర్పంచ్ నాయిక రాజు, ఎంపీటీసీ జయ, ఎస్‌ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, పీఈటీ యాదగిరి అభినందించారు.

ఆస్పత్రి నిర్వహణ, వైద్య సేవలపై సంతృప్తి



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని కాయకల్ప వైద్యాధికారుల బృందం శనివారం సందర్శించింది. ఆస్పత్రిలోని వివిధ విభాగాలతోపాటు పరిసర ప్రాంతాలను, రికార్డులను బృందం సభ్యు లు పరిశీలించారు. వైద్యసేవలు, పారిశుద్ధ్య వ్యవస్థ నిర్వహణ, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి వైద్యాధికారికి కాయకల్ప బృందం సభ్యులు సాయికిరణ్, రాము పలు సూచనలు చేశారు. వారి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ రాహుల్, ఆర్‌ఎంవో రహీం ఉన్నారు.



ఎస్సారెస్పీ వద్ద పర్యాటక కేంద్రం కోసం పరిశీలించిన స్థలం

ప్రతిపాదనలకే పరిమితం..

- అటకెక్కిన ఎస్సారెస్పీ పర్యాటకాభివృద్ధి
- 2019లో రూ. 50 కోట్లతో ప్రపోజల్స్
- ఎస్సారెస్పీ–బాసర బోటు సౌకర్యం అంటూ ప్రకటనలు
- బస్సాపూర్ శివారులో టూరిజం కేంద్రం కోసం స్థల పరిశీలన
- నేటికీ అడుగు ముందుకు పడని వైనం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితమైంది. టూరిస్టు ప్రాంతంగా తీర్చిదిద్దాలనే రెండున్నర దశాబ్దాల డిమాండ్ కలగానే మిగిలిపోతోంది. ఎస్సారెస్పీని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం 2019లో రూ. 50 కోట్ల నిధులతో ప్రతిపాదనలు చేసింది. అప్పటి పాలకులు అధికారులతో కలిసి వివిధ ప్రాంతాలను పరిశీలించారు. బాల్కొండ మండలం బస్సాపూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో పర్యాటకంగా అభివృద్ధి చేయాలని భావించారు. కానీ ఇప్పటికీ మోక్షం కలగలేదు. అయితే 2009లో ఎస్సారెస్పీ దిగువన పార్కు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. కోట్లను మంజూరు చేసింది. దీంతో పార్కు నిర్మించి చేతులు దులుపుకున్నారు.

2017లో కేసీఆర్ పరిశీలన

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2017 ఆగస్టులో సీఎం హోదాలో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పనులకు శంకు స్థాపన చేసేందుకు ముప్కాల్ మండల కేంద్ర శివారులో వరద కాలువ జీరో పాయింట్ వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే బాల్కొండ మండలం బస్సాపూర్ శివారులోని ఖాళీ స్థలాన్ని సీఎం కేసీఆర్ పరిశీలించారు. అప్పుడే ఈ స్థలాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించినా ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు.

బాసర వరకు బోటు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి బాసర వరకు గోదావరిలో బోటు సౌకర్యం కల్పించాలని అధికారులు అప్పట్లో నిర్ణయించారు. ఇందులో భాగంగా 2019లో బాసర నుంచి ఎస్సారెస్పీ వరకు బోటులో ట్రయల్‌రన్ నిర్వహించారు. బోటులో 60 కిలోమీటర్లు ట్రయల్ రన్ నిర్వహించగా.. రెండున్నర గంటల్లో బాసర నుంచి ఎస్సారెస్పీకి చేరుకున్నారు. గోదావరిలో మార్గమధ్యలో నందిపేట్ మండలం కుస్తాపూర్ రామాలింగేశ్వర స్వామి ఆలయం, నవీపేట్ తుంగిని హనుమాన్ ఆలయాన్ని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. కానీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

సీజన్‌లో వేలమంది పర్యాటకులు

ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిని వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల చేసే సమయంలో సందర్శించేందుకు ప్రతి రోజు వేలమంది పర్యాటకులు తరలివస్తుంటారు. దీంతో ప్రాజెక్టు జన కళను సంతరించుకుంటుంది. రెండు నెలలు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. మిగతా సమయాల్లోనూ పర్యాటకులు వస్తుంటారు. కొత్త ప్రభుత్వంలోనైనా పాలకులు స్పందించి ఎస్సారెస్పీని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.



రోప్‌వే కోసం ఎంపిక చేసిన మల్లన్నగుట్ట

చిల్లిగవ్వా మంజూరవలే..

బస్సాపూర్ శివారులో పర్యాటక కేంద్రం కోసం రూ. 50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. కానీ ఇప్పటికీ చిల్లి గవ్వ మంజూరు కాలేదు. అయితే టూరిస్టు ప్రాంతంగా అభివృద్ధి చేస్తే ఇక్కడి నుంచి కిలోమీటర్ దూరంలో నీటి మధ్య ఉన్న మల్లన్నగుట్ట వరకు రోప్‌వే వేయాలని అధికారులు భావించారు. కానీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అందంగా ఉండిపోయింది.



ట్రయల్ రన్ నిర్వహించిన బోటు(ఫైల్)

ప్రత్యేకాధికారుల జాబితా సిద్ధం!

- ఫిబ్రవరి 1న ముగియనున్న జీపీ పాలకవర్గాల గడువు
- కలెక్టరేట్‌కు చేరిన 530 మంది స్పెషల్ ఆఫీసర్ల లిస్టు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ఫిబ్రవరి 1న ముగియనుంది. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఈ ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో మండలంలో సీనియర్ అసిస్టెంట్ హోదా కలిగిన వారితో ప్రత్యేకాధికారుల జాబితా సిద్ధం చేయాలని ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలందాయి. దీంతో మండలాలవారీగా అన్ని జీపీలకు ప్రత్యేకాధికారులతో కూడిన జాబితాను సిద్ధంచేశారు. ఈ జాబితాను అప్రూవల్ కోసం కలెక్టరేట్‌కు పంపించారు. ప్రత్యేకాధికారుల పాలనపై ఇప్పటివరకు అధికారికంగా ఆదేశాలు రాలేదు. ఈనెల 29 లేదా 30వ తేదీన అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశముందని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 530 పంచాయతీలు, 4,932 వార్డు స్థానాలు ఉన్నాయి. అందులో ఇందల్వాయి మండలంలోని గంగారాం తండా, తిర్మన్‌పల్లి పంచాయతీలకు పలు కారణాల రీత్యా ఎన్నికలు జరగలేదు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక..

పంచాయతీల పాలకవర్గాల గడువు ముగియనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలాలవారీగా ప్రత్యేకాధికారులతో కూడిన జాబితా ఇప్పటికే కలెక్టరేట్‌కు చేరినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి అధికారిక ఆదేశాలు వచ్చిన వెంటనే కలెక్టర్ జాబితాకు ఆమో దం తెలపనున్నారు. సీనియర్ అసిస్టెంట్ హో దా కలిగిన అధికారులకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించాలని ఆదేశాలున్నాయి. కానీ జిల్లా లో ఒక్కో మండలంలో 35 వరకు గ్రామపంచాయతీలు ఉన్నాయి. 35 మంది సీనియర్ అసిస్టెంట్ స్థాయి గల అధికారులు లేకపోవడంతో జూనియర్ అసిస్టెంట్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులను కూడా నియమించినట్లు తెలిసింది.



సర్పంచులనే కొనసాగించాలని డిమాండ్

జీపీ పాలకవర్గాల గడువు ముగియనుండడంతో పర్సన్ ఇన్‌చార్జీలుగా సర్పంచులనే కొనసాగించాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. కొంతకాలంగా సర్పంచుల ఫోరం రాష్ట్ర నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ సర్పంచులు బీఆర్‌ఎస్ కండువాలు కప్పుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పర్సన్ ఇన్‌చార్జీలుగా సర్పంచులను కొనసాగిస్తే ఆ అధికారాన్ని బీఆర్‌ఎస్ గెలుపు కోసం వినియోగించే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈక్రమంలో సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

స్పెషల్ ఆఫీసర్, జీపీ కార్యదర్శికి చెక్ పవర్

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో సర్పంచులతో పాటు ఉపసర్పంచులకు చెక్‌పవర్ ఇచ్చారు. ఈ విషయంలో పలుచోట్ల మనస్పర్ధలు వచ్చాయి. పాలకవర్గాల గడువు ముగియనున్న నేపథ్యంలో సర్పంచుల అధికారాలన్నీ స్పెషల్ ఆఫీసర్ల కు ఉంటాయి. స్పెషల్ ఆఫీసర్‌తో పాటు పంచా యతీ కార్యదర్శికి చెక్ పవర్ ఇవ్వనున్న ట్లు తెలిసింది. కాగా సర్పంచులు బిల్లుల చెల్లింపు విష యంలో ఆందోళనలు వ్యక్తం చేస్తుండగా.. ఎంబీ రికార్డు, పంచాయతీ తీర్మానాలుంటే తప్పకుండా వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఎంపీపీపై అవిశ్వాస సమావేశం వాయిదా

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై సభ్యులు ఇచ్చిన అవిశాస్వ తీర్మాన నోటీసుపై ఈ నెల 29న నిర్వహించనున్న అవిశాస్వ సమావేశం వాయిదా వేసినట్లు ఆర్డీవో రాజేంద్ర కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీడీవో గోపిబాబు తెలిపారు. అవిశ్వాస సమావేశంపై ఎంపీపీ హైకోర్టు ద్వారా స్టే తెచ్చుకోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహించేది తర్వాత సమాచారం ఇస్తామన్నారు. అలాగే 29న వైస్‌ఎంపీపీపై అవిశ్వాస సమావేశం యథావిధిగా కొనసాగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీటీసీలు గమనించాలని ఆయన కోరారు.

మార్షల్‌ఆర్ట్స్‌తో బాలికలకు స్వీయరక్షణ



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

- జిల్లా జడ్జి సునీత కుంచాల
- ఆకట్టుకున్న విద్యార్థుల తైక్వాండో ప్రదర్శన


ఖలీల్‌వాడి: బాలికల్లో ఆత్మవిశ్వాసం, స్వీయరక్షణ కోసం తైక్వాండో ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. బాలికలు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుని వాటిని సాధించేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆత్మరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యాలయంలో జడ్జి మాట్లాడారు. అత్యవసర సమయాల్లో ఆత్మరక్షణ కోసం ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 700 మంది బాలికలకు నెల రోజుల పాటు తైక్వాండో శిక్షణ ఇప్పించామన్నారు. బాలికలు మెళకువలను ఇతర విద్యార్థినులకు సైతం నేర్పించాలన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో తమ ఆత్మరక్షణకు తైక్వాండో లాంటి విద్య ఉపయోగపడుతుందన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ న్యాయ, పోలీసు, కార్యనిర్వాహక వ్యవస్థలు బాలికల రక్షణకు పాటుపడుతున్నాయని పేర్కొన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ ఆత్మరక్షణ అనేది ఎల్లవేళలా రక్షణా ఆయుధమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, నిజామాబాద్ కార్పొరేషన్ కమిషనర్ మకరందు, బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి, ఏసీపీ జయరాం, అదనపు జిల్లా జడ్జి ఆశలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు గోపికృష్ణ, కుష్బు, బార్ అధ్యక్షుడు దేవదాసు, ఉపాధ్యక్షులు ఆశనారాయణ, కోచ్ మనోజ్ పాల్గొన్నారు. అనంతరం గురుకుల విద్యార్థినుల తైక్వాండో కరాటే ప్రదర్శన ఆకట్టుకుంది.

'బైపాస్'లో చీకట్లు!



సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో చీకటిగా ఉన్న బైపాస్ రోడ్డు

- మాధవనగర్ వద్ద ఆర్వోబీ పనులతో రోడ్డు మూసివేత
- కంఠేశ్వర్ బైపాస్ మీదుగా వాహనదారుల రాకపోకలు
- చీకట్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వైనం



నిజామాబాద్‌రూరల్: మాధవనగర్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పనులతో మూడు రోజుల క్రితం రోడ్డును మూసి వేశారు. వాహనదారులను కంఠేశ్వర్ బైపాస్ మీదుగా వెళ్లాలని అధికారులు సూచించారు. అయితే బైపాస్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో చీకట్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద కనీసం సూచిక బోర్డులు లేవు. బైపాస్ రోడ్డు దాదాపు 6 కిలోమీటర్లు ఉంటుంది. బైపాస్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో కొత్త నగరానికి వచ్చేవారు కంఠేశ్వర్ బైపాస్ వెళ్తే ఎటు వెళ్తామో అని అయోమయానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి వాహనదారుల క్షేమం కోసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



మాధవనగర్ వద్ద రైల్వే బ్రిడ్జి పనులతో రైల్వే గేటు మూసివేశారు. వాహనాలు బైపాస్ మీదుగా వెళ్తున్నాయి. బైపాస్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రివేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలి. – జాజునా ప్రభాకర్, బర్థిపూర్

ఇబ్బందులు కలగకుండా చూస్తాం

కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో వెళ్తున్న వారు ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రివేళలో వేగంగా వెళ్లొద్దు. ప్రమాదాల నివారణకు అక్కడక్కడ లైట్లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నివేదిస్తాం. – మనోహర్, ఆర్‌అండ్‌బీ ఏఈ

రోడ్డుకోసం ఇల్లు త్యాగం

- సొంతింటిని కూల్చేయించిన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్



ఎమ్మెల్యే ఇంటిని కూల్చివేస్తున్న దృశ్యం

కామారెడ్డి టౌన్: అసెంబ్లీ ఎన్నికలలో ఇద్దరు సీఎం అభ్యర్థులను ఓడించి చరిత్ర సృష్టించిన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్.. మరోసారి సంచలన నిర్ణయంతో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారారు. కామారెడ్డి పట్టణంలో రోడ్డు విస్తరణ కోసం ముందుగా తన ఇంటినే కూల్చివేయించి ఆదర్శంగా నిలిచారు. శనివారం ఉదయం జేసీబీతో ఇంటిని కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఇది త్యాగం కాదని.. ప్రజలకిచ్చిన మాటకోసం, అభివృద్ధి కోసం ఎంత దూరమైనా వెళ్తానని ఎమ్మెల్యే పేర్కొంటున్నారు. అందరూ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు.

గంజాయి గమ్మత్తు!

- బడిపిల్లలు, యువకులే టార్గెట్
- పాఠశాలలకు పాకిన విష సంస్కృతి
- చాయ్ హోటళ్లు, పాన్‌షాపులే అడ్డాలు
- జిల్లాలో జోరుగా విక్రయాలు
- విశాఖ, మహారాష్ట్ర నుంచి సరఫరా
- పట్టించుకోని పోలీసులు, అధికారులు

నందిపేట్(ఆర్మూర్): పుస్తకం పట్టి పాఠాలు చదవాల్సిన చేతులతో విద్యార్థులు గంజాయి పీలుస్తున్నారు.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే వయస్సులో జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఇన్నేళ్లు నగరాలు, పట్టాలకు పరిమితమైన గంజాయి పల్లెల్లోని పాఠశాలలకూ పాకుతోంది. విద్యార్థులు, యువత భవితవ్యం వ్యసనాలకు బానిసవుతోంది. కిక్కు కోసం ఆరాటపడుతూ గంజాయికి అలవాటు పడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కాసుల కోసం కక్కుర్తి పడుతున్న కొందరు విద్యార్థులకు వివిధ రూపాల్లో గంజాయిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నందిపేట ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతోంది. యువతతో పాటు పాఠశాల స్థాయి విద్యార్థులకు మత్తును అలవాటు చేసి తప్పుదోవ పట్టిస్తున్నారు. కొందరు పేరొందిన వారి పిల్లలు కూడా వ్యసనాలకు అలవాటు పడి తమ భవితను నాశనం చేసుకుంటున్నారు.

ఉమ్మెడ బ్రిడ్జి మీదుగా సరఫరా

జిల్లాలో ఎక్కువ మొత్తంలో గంజాయి సరఫరా జిల్లా సరిహద్దు అయిన నందిపేట మండలం ఉమ్మెడ గోదావరి వంతెన జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి ప్రధాన నగరాలకు చేరుకుంటుంది. తర్వాత ప్రతి పల్లెలకు సరఫరా చేసి పాన్ షాపులు, చాయి హోటల్స్, కిరాణా షాపుల ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. నందిపేటలో వివేకానంద చౌరస్తా, ఆర్మూర్ బైపాస్ రోడ్డు, ఉమ్మెడ వంతెన, లక్కంపల్లి సెజ్ రోడ్డు లాంటి పలు ప్రాంతాలతో పాటు జిల్లాలోని వివిధ చోట్ల పలు ఇళ్లను, పాన్‌డబ్బాలను గంజాయి విక్రయదారులు అడ్డాలుగా మార్చుకుంటున్నట్లు సమాచారం. విద్యార్థులను, ఈజీ మనీ కోసం అలవాటుపడిన మరికొంత మందిని ఈ వ్యాపారంలోకి దించుతున్నారు. పాఠశాలల్లో ఒకరిని చూసి మరొకరు గంజాయికి అలవాటు పడుతున్నారు. ఈ అలవాటు చేసేలా విద్యార్థులను వ్యాపారులు ప్రోత్సహిస్తున్నారు. గంజాయికి బానిసైన యువకులు తమ వద్ద నగదు లేకపోతే సంబంధిత గంజాయి వ్యాపారులకు బైండోవర్ అయి విక్రయదారులుగా మారుతున్నారు.



నందిపేటలో గంజాయిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

క్షోభకు గురవుతున్న తల్లిదండ్రులు

గంజాయితో చాలామంది డిప్రెషన్‌లోకి వెళ్తున్నారు. అలాగే మానసిక స్థితి సరిగ్గా లేకపోవడం, గ్రహణ శక్తిని కోల్పోతున్నారు. ఇటీవల డొంకేశ్వర్ మండలం గాదేపల్లికి చెందిన నందిపేటలో నివసిస్తున్న 14 ఏళ్ల బాలుడు గంజాయికి బానిసై ఇంట్లో ఎవరినీ గుర్తు పట్టకుండా కోమలోకి వెళ్లినట్లు తెలిసింది. ఆ బాలుడికి హైదరాబాద్‌లో చికిత్స అందిస్తున్నారు. తమ పిల్లలు గంజాయికి అలవాటు పడినట్లు ఇంట్లోని తల్లిదండ్రులకు తెలిసినా బయటకు చెప్పుకోలేక ఆందోళన చెందుతూ మానసిక క్షోభను అనుభవిస్తున్నారు.

విచ్చలవిడిగా అమ్మకాలు..

గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నా పోలీసులు, సంబంధిత ఎక్సైజ్ శాఖ దృష్టి సారించడంలేదు. దీంతో గంజాయి దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. గంజాయి మత్తులో ఉన్న యువత కొన్ని సందర్భాల్లో ఇతరులపై దాడులు చేస్తున్న ఘటనల్లో పోలీసులకు ఫిర్యాదులు వచ్చినా కేసులు పెట్టకుండా మందలించి పంపించేస్తున్న ఘటనలున్నాయి. కాగా మూడు రోజుల క్రితం నందిపేటలో 3.5 కిలోల గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నా ఎవరికి విక్రయిస్తున్నారు. ఎక్కడి నుంచి వస్తుందనే విషయాలను గోప్యంగా ఉంచారు. గంజాయితో పట్టుబడిన వారికి సెల్‌ఫోన్ కూడా లేదని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి గంజాయి విక్రయాలదారులపై ఉక్కుపాదం మోపి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఓసీబీ స్లిప్పులు, బాల్‌పెన్నుల్లో విక్రయం

సిగరేట్‌లో ఉన్న తంబాకు పొడిని తీసేసి అందులో ఓసీబీ స్లిప్‌లో గంజాయి పెట్టి విక్రయిస్తున్నారు. మాములు కాగితం మంట అంటుకుంటే వేగంగా కాలిపోతుంది. ఈ ఓసీబీ స్లిప్ ప్రత్యేకమైన కాగితం కావడంతో గంజాయి నింపినప్పుడు సిగరేట్ తరహాలో ఆరిపోకుండా వెలుగుతుంది. అంతేకాకుండా బాల్‌పెన్నులలో ఉన్న రీఫిల్‌ను తీసేసి అందులో ఓసీబీ స్లిప్‌లను ఉంచి విద్యార్థులకు సరఫరా చేస్తున్నారు. దీంతో విద్యార్థులు అనుమానం రాకుండా మామూలుగా జేబులో పెన్నులు పెట్టుకుని తరగతి గదులకు గంజాయిని తీసుకెళ్తున్నారు. వీలు దొరికినప్పుడు గంజాయిని సేవిస్తున్నారు. మరికొంత మంది యువకులు హైదరాబాద్ నుంచి హుక్కా పాట్స్ తీసుకువచ్చి గంజాయిని నింపి సేవిస్తున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో పీజీ 3, 5, 7, 9వ సెమిస్టర్‌ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ అరుణ, ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. తెయూ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీ, లా కాలేజీ, సౌత్‌ క్యాంపస్‌ భిక్కనూర్‌, ప్రభుత్వ గిరిరాజ్‌ డిగ్రీ కాలేజీ, ఆర్మూర్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రాల్లో సెమిస్టర్‌ పరీక్షలు కొనసాగుతున్నట్లు చెప్పారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1,699 మందికి 1,609 మంది హాజరు కాగా 90 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 181 మందికి 180 హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాల్‌ ప్రాక్టీస్‌ నమోదు కాలేదని కంట్రోలర్‌, ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ పేర్కొన్నారు.

సీపీ ఆఫీస్‌కు టూ టౌన్‌ ఎస్సై అటాచ్‌

ఖలీల్‌వాడి: నగరంలోని టూ టౌన్‌ ఎస్సై అశోక్‌ను పోలీస్‌కమిషనరేట్‌కు అటాచ్‌ చేసినట్లు తెలిసింది. పీఎస్‌లో పనుల అలసత్వం కారణాంగానే ఎస్సైని అటాచ్‌ చేసినట్లు సమాచారం. డిచ్‌పల్లి ఎస్సై మనోజ్‌ను తాత్కాలిక టూ టౌన్‌గా నియమించినట్లు తెలిసింది.

రేపు బస్సుల ప్రారంభం

బోధన్‌: రాష్ట్ర ప్రభుత్వం బోధన్‌ ఆర్టీసీ డిపోకు సమకూర్చిన నాలుగు లహరి (నాన్‌ ఏసీ) బస్సులను ఎమ్మెల్యే సుదర్శన్‌ సోమవారం ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్‌ శ్రీనివాస్‌ శనివారం తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తూము పద్మశరత్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్‌, ఏసీపీ కిరణ్‌ కుమార్‌, కౌన్సిలర్లు, ఆర్టీసీ ఆర్‌ఎం, డిప్యూటీ ఆర్‌ఎం హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఒకరికి జరిమానా

నిజాంసాగర్‌: మండల కేంద్రంలోని వారంతపు సంతలో బహిరంగ ధూమపానం చేస్తున్న వ్యక్తికి పోలీసులు శనివారం జరిమానా విధించారు. సంతలో కూరగాయల విక్రయానికి వచ్చిన సదరు వ్యక్తి బహిరంగంగా ధూమపానం చేస్తుండటంతో పోలీసులు కనిపెట్టి ఆన్‌లైన్‌ ద్వారా జరిమానా విధించారు.

14 మంది రిమాండ్‌

వేల్పూర్‌: మండలంలోని వాడిలో కుల బహిష్కరణ చేసిన గురడికాపు సంఘం సభ్యులు 14 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన నర్సయ్య తన వ్యక్తిగత సమస్యను పరిష్కరించడానికి కుల సంఘ సభ్యులు రూ. 13 లక్షలు చెల్లించాలని నిబంధన విధించినట్లు తెలిపారు. ఆ డబ్బు చెల్లించకపోవడంతో సంఘ సభ్యులు కుల బహిష్కరణ చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు 14 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- వంట రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని గవర్నర్‌ వెల్లడి
- మార్గదర్శకాల కోసం రైతుల ఎదురుచూపులు





మోర్తాడ్‌: రాష్ట్రంలోని రైతులకు రూ. 2 లక్షల పంట రుణమాఫీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని గవర్నర్‌ తమిళిసై రిపబ్లిక్‌ డే వేడుకల్లో ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన రిపబ్లిక్‌ డే వేడుకల్లో పంట రుణాల మాఫీకి కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీని గవర్నర్‌ ప్రస్తావించడం విశేషంగా మారింది. గత ప్రభుత్వం రూ.లక్ష పంట రుణ మాఫీకి హామీ ఇచ్చినా పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో అనేక మంది రైతులకు పంట రుణ మాఫీ ఫలాలు అందలేదు. కాంగ్రెస్‌ మొదటి నుంచి తాము అధికారంలోకి వస్తే రూ. 2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రైతురుణ మాఫీపై పలుమార్లు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉండటంతో రుణమాఫీకి నిధులు సమకూర్చే అంశంపై పలు విధాలుగా సమాలోచనలు చేపట్టారు. బ్యాంకులతో ప్రభుత్వం నేరుగా సంప్రదింపులు చేపట్టి రైతులకు మాఫీ చేసిన తర్వాత ప్రభుత్వం బ్యాంకులకు విడతల వారీగా నిధులను సమకూర్చే అంశంపై చర్చించారు. ఈ అంశం కొలిక్కి రాకపోవడంతో రుణమాఫీపై కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తద్వారా నిధులను సమకూర్చే మార్గాలను పరిశీలించాలని ఆలోచన చేశారు. రుణమాఫీపై తమకు చిత్తశుద్ధి ఉందనే విషయాన్ని గవర్నర్‌ ప్రసంగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చెప్పించడం పరిశీలిస్తే కొద్ది రోజుల్లోనే పంటరుణ మాఫీ జరుగనుందని వెల్లడవుతోంది.

మెజార్టీ రైతులకు..

గత ప్రభుత్వం జిల్లాలో 2,91,188 మంది రైతులకు రూ.1,790 కోట్ల పంట రుణాలను మాఫీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. విడతల వారిగానే నిధులను విడుదల చేయడంతో 97,418 మంది రైతులకు రూ.490.72 కోట్ల రుణాలను మాఫీ చేసింది. మెజార్టీ రైతులకు పంట రుణాలు మాఫీ జరుగకపోవడంతో బ్యాంకుల దృష్టిలో రైతులు డిఫాల్టర్లుగా ఉన్నారు. ప్రభుత్వం రుణమాఫీపై పలుమార్లు ప్రకటనలు చేసినా మార్గదర్శకాలను మాత్రం జారీ చేయలేదు. దీంతో ఎంత మంది రైతులకు పంట రుణాలు మాఫీ జరుగుతాయి, ఎంత మంది అనర్హులు అవుతారో స్పష్టత రావడం లేదు. వ్యవసాయ శాఖ సేకరించిన లెక్కల ప్రకారం జిల్లాలో 2,12,361 మంది రైతులు రూ.895.76 కోట్ల పంట రుణాలను బ్యాంకుల నుంచి పొందారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం రుణమాఫీని రైతుల వారిగా వర్తింప చేస్తారా లేక ఒక కుటుంబంలో ఒకరికే మాఫీ చేస్తారా అనే విషయంలో స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అనేక కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు అంత కంటే ఎక్కువ మంది పంట రుణాలను బ్యాంకుల నుంచి పొందారు.

రైతుభరోసా విషయానికి వస్తే కుటుంబం అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా అందరి రైతులకు పెట్టుబడి సాయం అందించారు. పంట రుణ మాఫీకి ఎక్కువ మొత్తంలో నిధులు అవసరం కావడంతో ప్రభుత్వం ఎలాంటి గైడ్‌లైన్స్‌ ఇస్తుందోననే సందేహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి

అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి

సుభాష్‌నగర్‌: ప్రతిఒక్కరూ సామాజిక సేవాకార్యక్రమాలతోపాటు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికసాయాన్ని అందించాలని అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి పేర్కొన్నారు. ఆఫీసర్స్‌ క్లబ్‌లో శనివారం నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనేక మంది పేద విద్యార్థులు ఆర్థికస్థోమత లేక ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, అలాంటి వారికి ఆఫీసర్స్‌ క్లబ్‌ నుంచి ప్రతియేటా ఆర్థికసాయం అందించాలని సూచించారు. క్లబ్‌లో స్విమ్మింగ్‌ పూల్‌ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం సీనియర్‌ షటిల్‌ బ్యాడ్మింటన్‌ క్రీడాకారుడు హన్మంత్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్‌ సీనియర్‌ సభ్యుడు పాతంగల్‌ రాంకిషన్‌ రావు, క్లబ్‌ ఉపాధ్యక్షుడు తాహెర్‌ బిన్‌ హందాన్‌, క్లబ్‌ సెక్రటరీ చిలువేరి సత్యనారాయణ,జాయింట్‌సెక్రటరీ వెంకట్రాములు,కోశాధికారి గంగాకిషన్‌ పాల్గొన్నారు.

లోక్‌ అదాలత్‌లో కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న న్యాయవాదులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్ర కారాగారంలో శనివారం నిర్వహించిన జైలు లోక్‌ అదాలత్‌లో 13 క్రిమినల్‌ కేసులను పరిష్కరించినట్లు కామారెడ్డి జిల్లా జూనియర్‌ సివిల్‌ జడ్జి సుధాకర్‌ తెలిపారు. జిల్లా జైలును జడ్జి శనివారం సందర్శించారు. జైలు సూపరింటెండెంట్‌ ప్రమోద్‌, జైలర్‌ ఉపేందర్‌ రావు, రాజశేఖర్‌రెడ్డిలతో జ్యుడిషియల్‌ రిమాండ్‌లో ఉన్న ఖైదీల వివరాలు, వారిపై ఉన్న కేసులను అధ్యయనం చేసినట్లు చెప్పారు. బాన్సువాడ, బిచ్కుంద, కామారెడ్డి అదనపు జ్యుడిషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ కోర్టులలో విచారణలో ఉన్న 13 కేసులను లోక్‌ అదాలత్‌లో పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌కు రిమాండ్‌

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పీఎస్‌ పరిధిలో పని చేస్తున్న కానిస్టేబుల్‌ మహేశ్‌కు జిల్లా కోర్టు రిమాండ్‌ విధించినట్లు రూరల్‌ ఇన్‌చార్జి ఎస్సై రామారావు శనివారం తెలిపారు. గతంలో ఓ కేసు విషయంలో కానిస్టేబుల్‌ మహేశ్‌ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల తిరిగి విధుల్లోకి చేరిన అతను గత సోమవారం ఓ కేసు విషయంలో బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విచారణలో తేలడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కానిస్టేబుల్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బోధన్‌లో ఆటో బోల్తా

- ఒకరి మృతి, పలువురికి గాయాలు

బోధన్‌టౌన్‌: పట్టణంలోని ఆటోనగర్‌లో డివైడర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. బోధన్‌ నుంచి నిజామాబాద్‌కు ఆరుగురి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ఆటోనగర్‌ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న మారుతి (20) తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగితా వారికి గాయాలు కావడంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ వీరయ్య తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అక్రమాలు బయటపడతాయనే భయంతోనే..

- అధికార పార్టీ మద్దతు కోరుతున్న వైస్‌చైర్‌పర్సన్‌ వర్గీయులు
- నీచరాజకీయాలు మానుకోవాలంటున్న తిరుగుబాటు కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ఆర్మూర్‌: ఆర్మూర్‌ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌ పండిత్‌ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గిన అనంతరం ఆమె కుటుంబ సభ్యులు చేసిన అవినీతి, అక్రమాలు బయటపడతాయనే భయంతో అధికార పార్టీ మద్దతు కోరుతున్నట్లు తిరుగుబాటు కౌన్సిలర్లు ఆరోపించారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికార కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సైతం కౌన్సిలర్లు, బీజేపీ, ప్రజలు తిరస్కరించిన వారికి మద్దతుగా నిలవొద్దని సూచించారు. అవిశ్వాస తీర్మానం అనంతరం జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వినిత వర్గీయులు హైకోర్టులో వేసిన పిటిషన్‌ డిస్మిస్‌ అయినా ఇంకా వారు ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా నీచ రాజకీయాలు మానుకొని మున్సిపాలిటీ నుంచి తప్పుకోవాలని హితవు పలికారు. సమావేశంలో మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ షేక్‌ మున్ను, కౌన్సిలర్లు గంగామోహన్‌ చక్రు, రాము, ఇట్టెడి నర్సారెడ్డి, రమేశ్‌, లిక్కి శంకర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్‌, రంగన్న, పూజ నరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు మంత్రి పదవులు కేటాయించాలి




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పాండు యాదవ్‌

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర మంత్రి వర్గంలో బీసీలకు చెందిన 8 మందిని, కార్పొరేషన్‌ పదవుల్లో 50 శాతం మేరకు అవకాశం కల్పించాలని తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్‌ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా శాఖలను పటిష్ఠం చేస్తూ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి వరకు అన్ని శాఖల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పైలెట్‌ ప్రాజెక్టుగా ఉమ్మడి జిల్లాలో బీసీ కులాల ఐక్య వేదికను గ్రామ స్థాయి నుంచి పటిష్ఠ పర్చడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అర్గుల్‌ రాజారం చిత్రాపటాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించి, జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎఫ్‌ఎం రేడియో, పీఎఫ్‌ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించిన గత మాజీ మంత్రి, ఎంపీగా పని చేసిన తాడూర్‌ బాలాగౌడ్‌ కాంస్య విగ్రహాన్ని కామారెడ్డిలో ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి, నాయకులు నిరంజన్‌, అరుణ్‌, విజయ్‌కుమార్‌, మహింద్ర,నాగరాజ్‌యాదవ్‌, శివకుమార్‌, దయానంద్‌, భాస్కర్‌, వేణు, దిలీప్‌, నాగేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీలు

ఖలీల్‌వాడి: జిల్లా పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని పలువురు సీఐలు శనివారం బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీజోన్‌-1 పరిధిలోని 18 మంది సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్‌ ఐజీ-2 డాక్టర్‌ తరుణ్‌జోషి ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత పోస్టింగ్‌	బదిలీ స్థానం
ఎస్‌. శ్రీనివాస్‌	సీఎస్‌బీ-3, నిజామాబాద్‌	ఐజీ కార్యాలయం
కె.చందర్‌రాథోడ్‌	ఎస్‌హెచ్‌వో, ట్రాఫిక్‌ సీఐ	సీఎస్‌బీ-3, నిజామాబాద్‌
ఎ. వెంకటేశ్వర్లు	ఐజీ కార్యాలయం సీఎస్‌బీ-2,	నిజామాబాద్‌
కె. ముత్యాలు	సీఎస్‌బీ-2, నిజామాబాద్‌	ఐజీ కార్యాలయం
వి. రవికుమార్‌	ఎస్‌హెచ్‌వో, సిద్దిపేట్‌ టౌన్‌	ఎస్‌హెచ్‌వో, ఆర్మూర్‌ టౌన్‌
బి.సురేశ్‌బాబు	ఎస్‌హెచ్‌వో, ఆర్మూర్‌ టౌన్‌	ఐజీ కార్యాలయం
పి. సురేందర్‌	సీఎస్‌బీ-3, సిద్దిపేట్‌	ధర్పల్లి
కె. మల్లేశ్‌	సీసీఎస్‌-నిర్మల్‌	డిచ్‌పల్లి
కె.కృష్ణ	డిచ్‌పల్లి	ఐజీ కార్యాలయం
బీడీ. ప్రేమ్‌కుమార్‌	ఎస్‌హెచ్‌వో, బోధన్‌	సీసీఎస్‌-3, నిజామాబాద్‌
ఎస్‌. వీరయ్య	సీసీఎస్‌-3, నిజామాబాద్‌	ఎస్‌హెచ్‌వో, బోధన్‌
జి.శ్రీనివాస్‌రాజు	బోధన్‌ రూరల్‌	సీసీఆర్‌బీ, నిజామాబాద్‌
కోలా నరేశ్‌	జైనథ్‌ రూరల్‌	బోధన్‌ రూరల్‌
ఐ.మనోజ్‌కుమార్‌	సీసీఆర్‌బీ, నిజామాబాద్‌	ఐజీ కార్యాలయం
కె. శ్రీధర్‌రెడ్డి	డీసీఆర్‌బీ, కామారెడ్డి	ఆర్మూర్‌ రూరల్‌
బి. గోవర్ధన్‌రెడ్డి	ఆర్మూర్‌ రూరల్‌	ఐజీ కార్యాలయం
ఎం.వీ సురేందర్‌రెడ్డి	సీసీఎస్‌-2, నిజామాబాద్‌	ఐజీ కార్యాలయం
జి. వెంకయ్య	పీసీఆర్‌, నిజామాబాద్‌	ఐజీ కార్యాలయం



క్రైం కార్నర్‌

వ్యాపారంలో నష్టాలు భరించలేక ఆత్మహత్య



సంతోష్‌కుమార్‌(ఫైల్‌)

ఆర్మూర్‌టౌన్‌: వ్యాపారంలో నష్టాలు భరించలేక మనస్తాపానికి గురైన ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆర్మూర్‌ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ధన్‌పాల్‌ సంతోష్‌కుమార్‌(45) పాత బస్టాండ్‌లోని ఓ షాప్‌లో పలు కంపెనీలకు చెందిన ఏజెన్సీలను నిర్వహిస్తున్నాడు. దీంతో వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన సంతోష్‌ ఈ నెల 24న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం పట్టణ శివారులోని గుండ్ల చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం నిమిత్తం పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా సంతోష్‌ మృతదేహంగా నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

మహమ్మద్‌నగర్‌లో బైక్‌ చోరీ

నిజాంసాగర్‌: మహమ్మద్‌నగర్‌ మండల కేంద్రంలోని ఓ స్వీట్‌ హోం ఎదుట నిలిపి ఉంచిన బైక్‌ శుక్రవారం రాత్రి చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని బాలాజీ స్వీట్‌ హోం నిర్వాహకుడు నరేశ్‌ తన షాప్‌ ఎదుట బైక్‌ నిలిపి ఉంచాడు. శనివారం ఉదయం బైక్‌ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్‌ నిర్వహించడం లేదని దీనిని అదునుగా చేసుకొని దుండగులు చోరీలకు పాల్పడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీజ్‌ చేసిన వాహనంలోని టేప్‌రికార్డర్‌..

వర్ని: మండల కేంద్రంలోని అటవీ శాఖ రేంజ్‌ కార్యాలయంలో నిలిపి ఉంచిన ఓమ్ని వాహనం నుంచి గుర్తు తెలియని దుండగులు టేప్‌ రికార్డర్‌ను చోరీ చేసినట్లు అటవీశాఖ అధికారులు శనివారం తెలిపారు. నెల రోజుల క్రితం ఓ కేసు విషయమై వాహనాన్ని సీజ్‌ చేసి కార్యాలయంలో ఉంచినట్లు చెప్పారు. గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి వాహనం అద్దాలను పగులగొట్టి టేప్‌ రికార్డర్‌ను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్‌ పరిధిలోని ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించిన రిపబ్లిక్‌ డే వేడుకలకు హాజరై ఇంటిరి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సూర్యనగర్‌లో..

నగరంలోని సూర్యనగర్‌లో నివాసం ఉంటున్న వినయ్‌ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. ఈనెల 25న రాత్రి ఇంటి నుంచి వెళ్లిన వినయ్‌ తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. వినయ్‌ భార్య ప్రతిభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత



రుద్రూర్‌: కోటగిరి పీఎస్‌ పరిధిలోని పోతంగల్‌ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



వినోద్‌ (ఫైల్‌)

మోపాల్‌: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన తలారి వినోద్‌ (33) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్‌ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట్‌ మండలం పొతంగల్‌కు చెందిన వినోద్‌ న్యాల్‌కల్‌కు చెందిన మౌనికతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఇల్లరికంగా వచ్చిన వినోద్‌ న్యాల్‌కల్‌లోనే ఉంటున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన అతను భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. శుక్రవారం రాత్రి సైతం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వచ్చి వారిని సముదాయించి వెళ్లిపోయారు. శనివారం ఉదయం అనుమానాస్పదస్థితిలో వినోద్‌ గదిలో మృతి చెందాడు. దీంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



సాయన్న మృతదేహం

బాల్కొండ: మండలంలోని బోదపల్లికి చెందిన రైతు గడ్డం చిన్నసాయన్న (60) గత గురువారం వరద కాలువలో కొట్టుకు పోయిన విషయం విధితమే. కాలువలో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టగా మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌ వద్ద వరద కాలువలో శనివారం కొట్టుకుపోతూ కనిపించడంతో స్థానికులు ఒడ్డుకు చేర్చారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాసముందర్‌ శివారులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై రాజశేఖర్‌ శనివారం తెలిపారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 3660 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గాయత్రి షుగర్స్‌లో జోరుగా క్రషింగ్‌

- ఇప్పటిదాకా 2.7 లక్షల మెట్రిక్‌ టన్నులు..
- రోజుకు 3,700 టన్నుల మేర క్రషింగ్‌



మాగి గాయత్రి కర్మాగారం

నిజాంసాగర్‌(జుక్కల్‌) : వానాకాలం చెరుకు సాగు చేసిన రైతులు క్రషింగ్‌ కోసం మాగి గాయత్రి చక్కెర కర్మాగారానికి తరలిస్తున్నారు. నిజాంసాగర్‌ మండలం మాగి గాయత్రి కార్మాగారంలో రోజుకు 3,700 మెట్రిక్‌ టన్నుల చొప్పున చెరుకు క్రషింగ్‌ జోరుగా సాగుతోంది. నవంబర్‌ నెల 7వ తేదీ నుంచి మాగి గాయత్రి కార్మాగారంలో చెరుకు క్రషింగ్‌ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 2.7 లక్షల మెట్రిక్‌ టన్నుల చెరుకు క్రషింగ్‌ జరిగినట్లు కేన్‌ మేనేజర్‌ వెంగళ్‌రెడ్డి తెలిపారు. కార్మాగారం పరిధిలో 4 లక్షల మెట్రిక్‌ టన్నుల చెరుకు క్రషింగ్‌ లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. చెరుకు పంట సాగు అగ్రిమెంట్‌ చేసుకున్న రైతులు చెరుకు నరికిస్తూ, లారీలు, ట్రాక్టర్లల్లో కార్మాగారానికి తరలిస్తున్నారు.

టన్నుకు రూ. 3,463 ధర చెల్లింపు

మాగి గాయత్రి కార్మాగారం పరిధిలో చెరుకు పంట సాగు చేసిన రైతులకు టన్నుకు రూ. 3,463 చొప్పున ధరను చెల్లిస్తున్నారు. ఉమ్మడి మెదక్‌, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల పరిధిలో 9వేల ఎకరాల్లో రైతులు చెరుకు పంట సాగు చేశారు. ఆయా గ్రామాల్లో చెరుకు పంట సాగు చేసిన రైతులకు కార్మాగారం తరపున గిట్టు బాటు ధర అందిస్తున్నారు. చెరుకు పంట నూర్పిడి కోసం కార్మాగారం తరుపున 23 చెరుకు నూర్పిడి యంత్రాలు, 80 ముఠాలు, 150 వాహనాలను సిద్ధం చేశారు. దాంతో ఆయా గ్రామాల్లో చెరుకు పంట నూర్పిడి చేస్తూ, కార్మాగా రానికి చెరుకును తరలిస్తున్నారు.

గ్రామీణ రైతులను ప్రోత్సహించడానికే సదస్సు



సదస్సులో కాన్సుల్‌ జనరల్‌ జెన్నిఫర్‌ లార్సన్‌



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

డిచ్‌పల్లి: గ్రామీణ ప్రాంత రైతులను ప్రోత్సహించేందుకే కాకతీయ శాండ్‌బాక్స్‌ రూరల్‌యాస్‌ డెవలప్‌మెంట్‌ డైలాగ్‌ 6వ ఎడిషన్‌లో భాగంగా 'స్థిరత్వంతో భవిష్యత్‌-నిరూపణ' నిర్వహించినట్లు సీఈవో మనీష్‌ జైస్వాల్‌ తెలిపారు. మండల శివారులోని జీ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన డెవలప్‌మెంట్‌ డైలాగ్‌-2024 సదస్సులో పలువురు ప్రముఖ వక్తలు పాల్గొని తమ అనుభవాలను వివరించారు. యూఎస్‌ కాన్సుల్‌ జనరల్‌ జెన్నిఫర్‌ లార్సన్‌ (హైదరాబాద్‌), నాబార్డు మాజీ చైర్మన్‌ డాక్టర్‌ చింతల గోవిందరాజ్‌, సెరెమార్ఫిక్‌ వ్యవస్థాపకుడు అండ్‌ సీఈవో వెంకట్‌ మట్టెల, వన్‌హెల్త్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు రమణన్‌ లక్ష్మీనారాయణ, కాకతీయ శాండ్‌బాక్స్‌ మాజీ సీఈవో రాజారెడ్డి, రెడ్‌బస్‌ సహా వ్యవస్థాపకులు సామ ఫణీంద్ర తదితరులు ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, యువత, నైపుణ్యం గలవారికి ప్రోత్సాహం అందించడానికి ఇలాంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమని వక్తలుపేర్కొన్నారు. అధిక దిగుబడి సాధించాలంటే రైతులు ఎలాంటి ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలో పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. సిద్దిపేట క్లస్టర్‌ బీసీఐ బృందం ఆధ్వర్యంలో పత్తిపంట సాగుపై ప్రదర్శించిన మూకీ డ్రామా ఆహుతులను ఆకట్టుకుంది. సదస్సులో కేహబ్‌ మేనేజర్‌ అక్షయ్‌ గోహర్కర్‌, పారిశ్రామికవేత్తలు, సూక్ష్మవ్యాపారవేత్తలు, ఎన్‌జీవోలు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.